ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

అవంచ గ్రామంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

నర్సాపూర్, ఏప్రిల్ 2 : మండల పరిధిలోని అవంచ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నరసింహగౌడ్ తండ్రి ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితోపాటు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీటీసీ బాబ్యానాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయూమొద్దీన్, మాజీ సర్పంచ్ కరుణాకర్, నాయకులు తిరుపతి రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 2 : బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. మండల పరిధిలోని అంబాజిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సాన రామచంద్రం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. కష్టకాలంలో ధైర్యంగా ఉండి ముందుకు సాగాలని కుటుంబసభ్యులకు ధైర్యాన్నిచ్చారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు రాజు ,వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాగారెడ్డి, స్వామి రవీందర్, నరసింహారెడ్డి, వెంకట్‌గౌడ్, లక్ష్మణ్, మోహన్, విశ్వనాథ రాములు, యాదగిరి మండలంలోని వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

డిప్యూటీ చైర్మన్‌కు ఆహ్వానం

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వెంకటాపూర్(కె) ముదిరాజ్ సభ్యులు

నిజాంపేట, ఏప్రిల్ 2 : మండలంలోని వెంకటాపూర్(కె) గ్రామంలో శ్రీ పెద్దమ్మతల్లి ఆలయ ఐదో వార్షికోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించనున్న పెద్దమ్మ పెద్దరాజుల కల్యాణానికి హాజరుకావాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్‌ను హైదరాబాద్‌లో వెంకటాపూర్(కె) గ్రామ ముదిరాజ్ సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు బొల్ల వెంకట్,కాశబోయిన దయాకర్, వెంకటయ్య, గాండ్ల రాజు, కాసనర్సింహులు, జనగామ వెంకట్ ఉన్నారు.

నగదు పట్టివేత

మెదక్, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ)/ పెద్దశంకరంపేట : లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం పోలీసుల తనిఖీల్లో రూ. 8.65 లక్షలు పట్టుబడ్డాయి. మండల కేంద్రమైన హవేళీ ఘనపూర్ వద్ద వాహనాల తనిఖీలో సరైన పత్రాలు లేని రూ.5.83 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు. పెద్దశంకరంపేట్ మండలం కోలపల్లి టోల్‌గేట్ దగ్గర శంకరంపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న అశోక్‌లెలాండ్ వెహికిల్‌ను పోలీసులు ఆపి తనిఖీ చేయగా, అందులో రూ.2.20 లక్షలు లభ్యమయ్యాయి. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీల్లో బైక్‌పై వెళ్తున్న డ్రం కంపెనీ సూపర్‌వైజర్ నితిన్ కుమార్ వద్ద ఎలాంటి పత్రాలు లేని రూ.62 వేలు స్వాధీనం చేసుకున్నారు.

కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద..

మనోహరాబాద్, ఏప్రిల్ 2 : మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా నగదును తీసుకెళ్తున్న రూ. 70 వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సిరిసిల్ల జిల్లా చెందుర్తి మండలం వెంగల్ గ్రామానికి చెందిన ముద్రకోల నరేశ్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 70 వేలను తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకొని రసీదు అందజేసినట్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా డబ్బులు రవాణా చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగ విరమణ సహజం : ఎంఈవో

కాగజ్‌మద్దూర్‌లో స్కూల్ అసిస్టెంట్ ఆదారపు శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ఎంఈవో బుచ్చానాయక్, ఉపాధ్యాయులు

నర్సాపూర్, ఏప్రిల్ 2 : ప్రతి ఉపాధ్యాయుడికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని మండల విద్యాధికారి బుచ్చానాయక్ వెల్లడించారు. మండల పరిధిలోని కాగజ్‌మద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఆదారపు శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం జరిగిన ప్రత్యేక సభనుద్దేశించి ఎంఈవో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంఈవో బుచ్చానాయక్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం మధ్యలో ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులు విద్యార్థులకు చివరి వరకు బోధన చేసేందుకు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ మండల విద్యాధికారి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు నాజియా తబస్సుం, మాజీ సర్పంచ్ శివకుమార్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో మేకల కాపరికి గాయాలు

చిలిపిచెడ్, ఏప్రిల్ 2 : మేకలను మేత కోసం తీసుకెళ్లిన మేకల కాపరిపై అడవి పంది దాడి చేసిన సంఘటన చిలిపిచెడ్ మండలంలోని అజ్జమర్రి గ్రామం లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాములు మేకల కాపరిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. మేకలను అడవికి తీసుకు పోతుండగా ప్రమాదవశాత్తు ముళ్ల పొదల నుంచి అడవి పంది రాములుపై దాడి చేసింది. అనంతరం అతడిని నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నట్లు మాజీ సర్పంచ్ పరశురాంరెడ్డి తెలిపారు. అజ్జమర్రి గ్రామ శివారులో ఫారెస్ట్ అధికారులు స్పందించి అడవి పందులను ఆరికట్టాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

తాగు నీటి సమస్య తలెత్తొద్దు..

- జిల్లాలో తాగునీటి సరఫరాలో సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- మిషన్ భగీరథ నీరు గడపగడపకూ అందాలి
- గ్రామాల్లో నర్సరీల రక్షణ బాధ్యత గ్రామ కార్యదర్శులదే..
- గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు ఉదయం 6 నుంచి 11 లోపే పని చేయాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే అందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో మరమ్మతుల్లో ఉన్న బోర్లు, చేతి పంపులు, మంచినీటి పైపులైన్లు లీకేజీ మరమ్మతులు, నూతన పైపు లైన్ల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసి గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. ఎక్కడైనా మంచినీటి సరఫరాలో ఇబ్బంది వస్తే తక్షణమే తమ దృష్టికి తేవాలని తెలిపారు. వేసవిలో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుతో నీటి సరఫరాకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మంచినీటి వనరులు మాత్రమే కాకుండా ప్రైవేటు బోర్లు, బావుల ద్వారా గ్రామాల్లో నీటిని అందించడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రైవేటు బోర్లు, బావులు ఇతర నీటి వనరుల వివరాలు సేకరించి నివేదికలు అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వాటి ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని అన్నారు. గ్రామాల్లో ప్రజల అవసరాలకు ఎన్ని లీటర్ల నీరు అవసరం, గ్రామంలో ఉన్న ఓహెచ్ ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల సామర్థ్యం ఎంత, ఎన్ని గంటలు బోర్లు నుంచి ట్యాంకులు నింపవచ్చు అనే అంశాలపై ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమగ్రమైన అవగాహన ఉండాలని తెలిపారు. వేసవి ముగిసేంత వరకు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రావొద్దని ఆయన పేర్కొన్నారు. పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని, మరమ్మతులకు వినియోగించే సామగ్రి నాణ్యత ఉండాలని తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎండల్లో బయట తిరగకుండా జాగ్రత్త వహించాలని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్యలో ఎట్టి పరిస్థితులలో ఇండ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు సూచించారు. ఉపాధి హామీ కూలీలు ఉదయం 6 నుంచి 11గంటల వరకు పని చేయాలన్నారు. ఉపాధి హామీ పని జరిగే ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కచ్చితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఎంహెచ్‌వో శ్రీరామ్, డీఆర్‌డీఏ శ్రీనివాస్ రావు, డీపీవో యాదయ్య, ఈఈ మిషన్ భగీరథ కమలాకర్ సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ

- జిల్లాలో 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం
- జిల్లా వ్యాప్తంగా 410 కొనుగోలు కేంద్రాలు

కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని తూకం వేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు (ఫైల్)

మెదక్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : యాసంగి సీజన్‌లో వరి కోతలు జోరందుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 4.20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే చాలా చోట్ల బోర్లు, బావుల కింద వేసిన పంటలు ఎండిపోవడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అయితే సివిల్ సప్లయ్ అధికారులు 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇదిలాఉండగా ఈ సీజన్‌లో ధాన్యాన్ని జిల్లాలోని అన్ని రైస్ మిల్లులకు ఇవ్వకుండా బాయిల్డ్ మిల్లులకే ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 75 రా రైస్ మిల్లులు ఉండగా, 30 బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా 410 కొనుగోలు కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు 410 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 279, ఐకేపీ ఆధ్వర్యంలో 108, డీసీఎంఎస్ 13, ఎఫ్‌పీవో (రైతు ఉత్పత్తిదారుల సంఘాలు) ఆధ్వర్యంలో 10 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో అవసరమయ్యే సామగ్రిని అందుబాటులో ఉంచారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండే విధంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఏ గ్రేడ్‌కు రూ. 2203..

సాధారణ రకానికి రూ.2,183

ధాన్యం కొనుగోళ్లకు రంగం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం రైతుల వద్ద నుంచి ఏ గ్రేడ్ ధాన్యం ధర క్వింటాలుకు రూ.2,203గా నిర్ణయించగా, సాధారణ రకానికి రూ.2,183 నిర్ణయించారు. టార్పాలిన్లు 12,300 అవసరం ఉండగా, ప్రస్తుతం 10,278 అందుబాటులో ఉన్నాయి. వడ్ల క్లీనర్లు 520 అవసరం కాగా, 464 అందుబాటులో ఉన్నాయి. తేమ యంత్రాలు 530 అవసరం కాగా, 524 ప్రస్తుతం ఉన్నవి. గన్నీ బస్తాలు 1.05 కోట్లు అవసరం ఉండగా, 47.46 లక్షల గన్నీ బస్తాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 20 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ నెల 15లోగా అన్ని కేంద్రాలను ప్రారంభిస్తామని సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

కలెక్టర్ ఆదేశాల ప్రకారం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా 410 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నాం. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. దళారులను నమ్మి మోసపోవద్దు.

-హరికృష్ణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం..

- గజ్వేల్‌కు విస్తృత స్థాయి సమావేశానికి భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు
- పార్టీ మారింది నేతలే... ప్రజలు, నాయకులు, కార్యకర్తలు కాదు..
- జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్

మనోహరాబాద్ మండలం దండుపల్లి నుంచి తరలివెళ్తున్న జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు

మనోహరాబాద్, ఏప్రిల్ 2 : బీఆర్ఎస్ తరుపున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ అన్నారు. గజ్వేల్‌లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ అధ్యక్షతన భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మరిచిపోలేదన్నారు. దొంగ హామీలతో వచ్చిన కాంగ్రెస్‌కు, అబద్ధపు ప్రచారం చేస్తున్న బీజేపీ పార్టీలకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. మనోహరాబాద్ మండలంలో ఇద్దరు, ముగ్గురు నేతలు మాత్రమే పార్టీనీ వీడారని, కానీ మండల వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీకి పునాదులుగా ఉన్నారన్నారు. మెదక్ అభ్యర్థిగా పోటీ చేయనున్న వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పురం నవనీతారవి ముదిరాజ్, ఎంపీటీసీ లతావెంకట్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు రాహుల్‌రెడ్డి, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, ఆత్మకమిటీ డైరెక్టర్ భిక్షపతి, నాయకులు పంజా భిక్షపతి, సాయి రాం, సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు ఘననివాళి

రామాయంపేట, ఏప్రిల్ 2 : రామాయంపేట పట్టణంలోని సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించింది. మంగళవారం పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహం వద్ద మండల గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె శ్రీనువాస్‌గౌడ్ పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాపన్న గౌడ్ గౌడన్నలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిద్ధిరాములు గౌడ్, రామస్వామిగౌడ్, శంకర్‌గౌడ్, ఈశ్వర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

మెదక్‌లో..

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 2 : సర్దార్ సర్వాయి పాపన్న 314వ వర్ధంతిని మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపులేరు వద్ద గల పాపన్న విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, నాయకులు ఎమ్ఎల్ఎన్‌రెడ్డి, గోవింద్‌రాజి, మహేశ్, సంగన్న, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేగోడ్‌లో..

రేగోడ్, ఏప్రిల్ 2 : ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 314 వ వర్ధంతిని నిర్వహించారు. మండల కేంద్రంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయం వద్ద నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వాయి పాపన్న అమర్‌హై అని నినాదాలు చేశారు. లక్ష్మా గౌడ్, సుభాశ్ గౌడ్, తుల్జారం గౌడ్, రామా గౌడ్, దశరత్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.



రామాయంపేటలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహిస్తున్న దృశ్యం

భారీ మెజార్టీతో గెలిపించాలి

రేగోడ్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రేగోడ్, ఏప్రిల్ 2 : జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ గెలుపునకు మండలంలోని ఆయా ఎంపీటీసీ స్థానాల్లో ఆరిటిక్యాల్, కొండాపూర్, రేగోడ్, కొత్వాల్‌పల్లి, మర్పల్లి, లింగంపల్లి, గజవాడ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించామని మండలాధ్యక్షుడు బుచ్చయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా అంథోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాల్గొన్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు, నాయకులకు ఓట్లు ఏవిధంగా రాబట్టాలో సలహాలు సూచనలు చేశారు. నాయకులు సుంకె రమేశ్, గ్రామాధ్యక్షుడు, మాజీ సర్పంచ్‌లు, యువకులు తదితరులు ఉన్నారు.

హోరా హోరీగా కుస్తీ పోటీలు

టేక్మాల్, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలోని దుర్గమ్మ, పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే వార్షికోత్సవంలో భాగంగా నాలుగో రోజు ఆలయ కమిటీ సభ్యులు కుస్తీ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి మల్లయోధులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అభిజిత్ విజేతగా నిలిచి 5 తులాల వెండి కడియం సొంతం చేసుకున్నాడు.

కాంట్రాక్టర్ తొలిగింపు

పాపన్నపేట, ఏప్రిల్ 2 : ఏడుపాయల్లో తీవ్ర వివాదాస్పదంగా మారి అధిక రుసుము వసూలు చేస్తున్నాడన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న కబేళ కాంట్రాక్టర్‌ను తొలగించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏడుపాయల్లో మూగజీవాల వధ కోసం నిర్ణయించిన ధరల కాంట్రాక్టర్ ఎక్కువ రుసుం వసూలు చేస్తున్నాడని నాగ్‌సాన్‌పల్లి గ్రామస్తులతోపాటు రాష్ట్ర రాష్ట్రేతర భక్తులు కొన్నేండ్లుగా ఈవో మోహన్ రెడ్డి, చైర్మన్ బాలాగౌడ్‌లకు ఫిర్యాదు చేస్తున్నారు. అతడిని వెంటనే తొలిగించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. దీంతో తాత్కాలికంగా కబేళ నిర్వహణ బాధ్యతలు,అతడి నుంచి తప్పించి, ఆలయ ఉద్యోగులకు అప్పచెప్పుతున్న ట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు.

సొమ్మసిల్లిన మహిళ ను చేరదీసిన న్యాయమూర్తి

నర్సాపూర్,ఏప్రిల్ 2 : అనారోగ్యంతో నిస్సహాయకురాలై మట్టిని తింటూ సొమ్మసిల్లిపోయిన ఓ మహిళను జూనియర్ సివిల్ జడ్జి అనిత చేరదీసి దవాఖానకు తరలించి వైద్యం అందించిన ఘటన నర్సాపూర్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. కోర్టు సమీపంలో 50 ఏండ్ల మహిళ అనారోగ్యంతో నిస్సహాయకురాలై నడవలేని స్థితిలో మట్టి తింటున్న విషయం పక్కనే నివాసం ఉంటున్న కొంత మంది వ్యక్తులు చూసి మండల్ లీగల్ సర్వీస్ కమిటీ కౌన్సిల్ న్యాయవాది స్వరూపారాణి ద్వారా న్యాయమూర్తి అనిత దృష్టికి తీసుకు వచ్చారు. తక్షణమే న్యాయమూర్తి అనిత స్పందించి స్థానికంగా ఉన్నటువంటి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మహిళకు మెరుగైన చికిత్సను అందించాలని డాక్టర్ మిర్జాకు మౌఖిక ఆదేశాలు ఇస్తూ మహిళకు సంబంధించినటువంటి పూర్తి వివరాలను సేకరించి సమాచారమివ్వాలని ఎస్సైని ఆదేశించారు. న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుల్స్ ఉన్నారు.

చెన్నాయపల్లికి నీటి విడుదల నిలిపివేత

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 2 : మండల పరిధి శాలిపేట నల్లచెరువు నుంచి చెన్నాయపల్లిలోని పంటపొలాలకు నీరు ఇవ్వడానికి అధికారులు జరిపిన చర్చలు సఫలమై సోమవారం నీరు విడుదల చేశారు. శాలిపేట రైతులు మంగళవారం నీటిని వదులాలని వెళ్లగా నీరు ఇవ్వడం కుదరదని తెలిపారు. శాలిపేట నల్లచెరువు నుంచి చెన్నాయపల్లి పంట పొలాలకు సుమారు 2కిలోమీటర్ల మేర దూరం ఉంటుంది దారిపొడవునా టాపర్లు వేస్తేనే నీరు ఇస్తామని లేదంటే ఇవ్వమని వారు చెప్పడంతో చెన్నాయపల్లి రైతులు ఆశలు ఆవిరైపోయాయి. దారి పొడవునా టాపర్లు వేయాలంటే లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చేగుంట, ఏప్రిల్ 2 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగి రూ. 11లక్షలు ఎత్తుకు పోయిన సంఘటన మెదక్ జిల్లా చేగుంటలో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన చేగుంటకు చెందిన సోమ రాములు ఇటీవల భూమి అమ్ముకోగా, వచ్చిన రూ.11లక్షలను ఇంట్లో దాచుకున్నాడు. తను ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న సిమెంట్ బస్తాల వద్ద రాత్రి కాపాలకు వెళ్లాడు. రాములు భార్య మక్కరాజిపేటలో పెద్దమ్మ పండుగ జరుగుతుండడంతో తన బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూసే వరకు ఇంటి తాళం ,బీరువాను పగలగొట్టి అందులోఉన్న రూ.11లక్షలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, చేగుంట ఎస్సై బాల్‌రాజు, రామాయంపేట సీఐ వెంకటేశ్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్‌రాజు తెలిపారు.

‘నకిలీ విత్తనాలతో మోసపోయాం’ ..

శివ్వంపేట, ఏప్రిల్ 2 : ఆరుగాలం కష్టపడి యాసంగి వరి పంటను సాగుచేస్తే పంట పొట్టకొచ్చి ఈనె దశకు వచ్చినా సరిగ్గా ఈనకపోవడంతో తాము నకిలీ విత్తనాలతో మోసపోయామని బాధిత రైతులు వాపోయారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన శివ్వంపేటలో బాధిత రైతులు కముల య్యగారి వెంకటేశ్, కములయ్య గారి శ్రీనివాస్, నర్సింహులు, షర్పోద్దీన్, రాములు, అర్జున్ తదితరులు కలిసి శివ్వంపేటలోని శ్రీ ఫర్టిలైజర్స్ దుకాణంలో కాస్వీయాన్ కంపెనీ పేరుతో గల భావన రకం వరి విత్తనాలను కొనుగోలు చేసి సుమారు 25 ఎకరాల వరకు వరిపంట యాసంగితో చేశారు. సాగుచేసిన వరి పైరు ప్రస్తుతం పొట్ట దశకు చేరుకుని ఈనె దశలో ఉండగా, వేసిన పంటను రైతులు గమనించగా అది సరిగా ఈనక పోవడంతో నకిలీ విత్తనాలతో నష్టపోయమని భావించి ఫర్టిలైజర్ దుకాణం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా, విషయం సీడ్ కంపెనీ దృష్టికి తీసుకెళ్తామని, మంగళవారం కంపెనీ సూపర్‌వైజర్‌ను శివ్వంపేటకు రప్పించారు. పొలాలను గమనించిన సీడ్ కంపెనీ సూపర్ వైజర్ విత్తనాల